అభివృద్ధే మా నినాదం

- మీఎంసీ కౌన్సిల్‌లో మేయర్ భాగ్యలక్ష్మి
- పీఎంఏవై – టిడ్కో ఇళ్ల అవకతవకలు, విజిలెన్స్ విచారణపై చర్చ
- పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం





కౌన్సిల్ సమావేశానికి హాజరైన సభ్యులు, (ఇన్‌సెట్) మాట్లాడుతున్న మేయర్ భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరాన్ని అభివృద్ధి చేయటమే తమ నినాదమని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం మీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో మేయర్ ఆధ్వర్యంలో కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరాభివృద్ధిని గత పాలకులు పట్టించుకున్న దాఖలాలు లేవని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన నాలుగున్నరేళ్ల కాలంలో విజయవాడ నగరాన్ని కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేశామని, మూడు సర్కిళ్ల పరిధిలోని 64 డివిజన్లలోనూ తాము చేసిన అభివృద్ధి కనిపిస్తుందన్నారు. సమావేశంలో మొత్తం 121 అంశాలు అజెండాలో ప్రతిపాదన రాగా అందులో 110 అంశాలు ఆమోదం పొందాయి. రెండు అంశాలు ఆఫీస్ రిమార్కుకు పంపారు. రెండు అంశాలను ధ్రువీకరించారు. మూడు అంశాలను విద్యాశాఖకు, ఒక అంశాన్ని సెర్ప్‌కు(సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ)కి సిఫార్సు చేస్తూ తీర్మానించారు. రెండు అంశాలు రికార్డు చేయగా, ఒక అంశాన్ని ఆఫీసు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

టీడీపీ వర్సెస్ వైఎస్సార్ సీపీ..

ప్రశ్నోత్తరాల సమయంలో టిడ్కో పీఎంఏవై(ప్రధాన మంత్రి ఆవాస యోజన)–ఏపీ హౌసింగ్ టిడ్కో లబ్ధిదారులకు కేటాయింపులపై వచ్చిన ప్రశ్నపై వైఎస్సార్ సీపీ–టీడీపీ మధ్య వాడీవేడి వాగ్వాదం జరిగింది. దీనిపై గతంలో విజిలెన్స్ విచారణకు కౌన్సిల్ తీర్మానం చేసినా ఇంత వరకు ఎలాంటి పురోగతి లేకపోవటంతో మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధికారులను, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను వివరణ కోరారు. మీఎంసీలోని ఎస్టేట్స్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ప్రజారోగ్య విభాగాలకు సంబంధించి ఎన్ని కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.. హైకోర్టు, లోకల్ కోర్టుల వారీగా కేసుల వివరాలను అడిగిన ప్రశ్నపై ఆయా విభాగం అధికారులు కేసుల వివరాలను సభ్యులకు వివరించారు.

ప్రధానాంశాలు..

- ఎన్టీయార్ సర్కిల్ నుంచి పాత చెక్‌పోస్టు వరకు ఉన్న బందరురోడ్డును 100 అడుగుల రోడ్డుగా విస్తరించేందుకు పనులు గతంలో ప్రారంభించి మధ్యలో ఆగిపోయాయని, తిరిగి పనులు ప్రారంభించాలని వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు ఆఫీస్ రిమార్కులు కోరుతూ తీర్మానించారు.
- గతంలో టిడ్కో ఇళ్ల నిమిత్తం ప్రభుత్వానికి లబ్ధిదారులు తమ వాటా మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించారని, కానీ వారికి ఇళ్ల మంజూరు కానందున తిరిగి వారి సొమ్మును చెల్లించాలని వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు ఆమోదించారు.
- మాజీ కార్పొరేటర్ పాముల మాలకొండయ్య ఆర్థిక పరిస్థితి అంతగా బాగోలేదని, ఆయన ఉండేందుకు నివాసం కూడా లేకపోవటం ఇబ్బందులు పడుతున్నారని, ఆయనకు మానవతా దృక్పథంతో జేఎస్ఎన్‌యూఆర్ఎం పథకంలో ఒక ఇంటిని కేటాయించాలని వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు ఆమోదించారు.
- నగరంలో కుక్కలు, దోమలు, కోతుల బెడద అధికంగా ఉందని వీటిని నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పలువురు కార్పొరేటర్లు చేసిన ప్రతిపాదనపై మీఎంసీ కౌన్సిల్ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి సమస్య పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తామన్నారు.
- సర్కిల్–1 పరిధిలోని ఎర్రకట్ట జంక్షన్ నుంచి లోటస్‌ల్యాండ్ మార్క్ వరకు ఉన్న 5వ లైన్ సీసీ రోడ్డు వేయాలని అందుకు అయ్యే రూ. 60 లక్షలు మీఎంసీ జనరల్ బడ్జెట్ నుంచి కేటాయించాలని వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు ఆమోదం తెలుపుతూ తీర్మానించారు.
- 37వ డివిజన్‌లోని జెండాచెట్టు సెంటర్ నుంచి హిందూహైస్కూల్ వరకు సుబ్బరామయ్య వీధి బీటీ రోడ్డు వేయటానికి అయ్యే రూ. 62.12 లక్షలు మీఎంసీ సాధారణ నిధుల నుంచి ఖర్చు చేయాలని వచ్చిన ప్రతిపాదనను ఆమోదిస్తూ తీర్మానించారు.
- సెంట్రల్ నియోజకవర్గం 3వ డివిజన్‌లోని అయోధ్య నగర్‌లో బుడమేరు కట్ట వెంబడి సీకే రోడ్డు నుంచి సూర్యా కాలనీ వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.72.56 లక్షలు నిధులను కార్పొరేషన్ జనరల్ బడ్జెట్ నుంచి కేటాయించాలని వచ్చిన ప్రతిపాదనను ఆమోదించారు.

క్లుప్తంగా

దుర్గమ్మ సేవలో దేవదాయశాఖ కమిషనర్



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ మంగళవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన కమిషనర్ సత్యనారాయణను ఆలయ ఈవో కేఎస్ రామారావు సాదరంగా స్వాగతం పలికారు. అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలకగా, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ ఈవో రామారావు అమ్మవారి ప్రసాదాలు, పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయంలో జరుగుతున్న మాస్టర్ ప్లాన్ పనులు, మల్లేశ్వర స్వామి వారి ఆలయాభివృద్ధి పనుల గురించి ఈవో, ఈఈలు కోటేశ్వరరావు, ఎల్. రమాదేవి వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని లూనా సెంటర్ 11కేవీ లైన్ మరమ్మతుల నేపథ్యంలో బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ బీవీ సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు.

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ బీవీ సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. వాంబేకాలనీ, దేవినేని గాంధీపురం, పైపులరోడ్డు, వైఎస్సార్ పార్క్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కిటకిటలాడిన దాసాంజనేయ స్వామి దేవాలయం



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయ స్వామివారి దేవాలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన సిందూరం, ఆకుపూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వాహన చోదకులు వాహన పూజలు చేయించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ నాగినేని భవాని, ధర్మకర్తల మండలి ఛైర్మన్ కనపర్తి కొండలరావు పర్యవేక్షించారు.

కుష్ఠు రహిత సమాజ స్థాపనకు కృషి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతీ ఒక్కరూ కుష్ఠువ్యాధి రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలని 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి సూచించారు. 27వ డివిజన్‌లోని గులాబీతోట వార్డు సచివాలయంలో మంగళవారం ప్రపంచ కుష్ఠువ్యాధి నివారణ దినం పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ కుష్ఠువ్యాధిని ఆరంభ దశలోనే గుర్తించి ఎండీటీ చికిత్స ఇవ్వడం ద్వారా అంగవైకల్యం రాకుండా నివారించవచ్చని తెలిపారు. అనంతరం కుష్ఠువ్యాధి నివారణకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కొండాయగుంట రాము, గణేష్, హెల్త్ సూపర్‌వైజర్ జయలక్ష్మి, సుకన్య, లక్ష్మీతిరుపతమ్మ, రవీనా, కిరణ్, హేమలత పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ వైన్‌షాపుల్లో మద్యం సీసాలను కొనుగోలు చేసి వాటిని బ్లాకులో విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ఇద్దరు వ్యక్తులను అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గవర్నర్‌పేటకు చెందిన ధనుష్, మహేష్ అనే వ్యక్తులు ప్రభుత్వ వైన్‌షాపులో పని చేస్తున్నారు. ఇక్కడ మద్యం సీసాలను తక్కువ ధరలకు కొనుగోలు చేసి వాటిని అధిక ధరలకు బయట విక్రయించేందుకు ప్రయత్నిస్తూ సింగ్‌నగర్ దాబాకొట్లు సెంటర్‌లో పోలీసులకు పట్టుబడ్డారు. ఎస్సై సౌజన్య ఆధ్వర్యంలో సిబ్బంది నిందితులిద్దరిని అదుపులోకి తీసుకొని వారి వద్ద 180 ఎంఎల్ విస్కీ బాటిల్స్ 18 స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టు ఎదుట హాజరు పరిచారు.

అదనపు కట్నంపై కేసు నమోదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అదనపు కట్నం కోసం భర్త అత్తమామలు వేధిస్తున్నారంటూ గుణదల పోలీస్‌స్టేషన్‌లో మహిళ ఫిర్యాదు చేయడంతో మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుణదల గాంధీజీకాలనీలో కొర్నెపాటి కావ్యశ్రీ భర్త సాయినాథ్, అత్తమామలతో కలిసి నివసిస్తున్నారు. వీరికి 2020లో వివాహం జరిగింది. గత కొంతకాలంగా భర్త, అత్తమామలు అదనపు కట్నం తీసుకురావాలంటూ ఆమెను వేధిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీతోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు

- చిట్టచివరి గడప వరకు సంక్షేమ పథకాలు
- సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త వెలంపల్లి శ్రీనివాసరావు



ప్రభుత్వ పథకాలతో కూడిన కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 30వ డివిజన్ రామకృష్ణాపురంలో మంగళవారం ప్రతీ గడపకు మన వెలంపల్లి శ్రీనివాస్ అనే నినాదంతో ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ బీ జానారెడ్డితో కలిసి ఆయన గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరించారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాస్ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా చేసుకుని పారదర్శక పాలన అందిస్తున్నామని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా చిట్టచివరి గడప వరకూ సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం అని చెప్పారు.

నమ్మకద్రోహానికి కేరాఫ్ చంద్రబాబు

వెన్నుపోటు, నమ్మకద్రోహానికి కేరాఫ్ చంద్రబాబు అని వెలంపల్లి పేర్కొన్నారు. తన రాజకీయ ప్రయోజనాల కోసం నందమూరి కుటుంబాన్ని నాశనం చేసిన వ్యక్తి చంద్రబాబు అని అన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, లోకేష్‌కు సీఎం జగన్ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో వారికి గుణపాఠం తప్పదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం సోనియాగాంధీని ఎదిరించిన మొనగాడు సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తిరుగులేని మెజార్టీతో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అమ్ముల వివేకానంద, దుర్గారావు, సీహెచ్ సుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.



57వ డివిజన్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

57వ డివిజన్‌లో..

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 57వ డివిజన్ న్యూరాజరాజేశ్వరీపేటలో ప్రతీ గడపకు మన వెలంపల్లి శ్రీనివాస్ కార్యక్రమం మంగళవారం సాయంత్రం జరిగింది. ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ ఇసరపు దేవి, కోఆప్షన్ సభ్యుడు అలీమ్‌లతో కలిసి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఇంటింటికి తిరిగి స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. 57, 60, 63, 64వ డివిజన్ల పరిధిలోని ప్రభుత్వ ఇళ్లల్లో దశాబ్దాలుగా నివసిస్తున్న పేద ప్రజల చిరకాల కోరిక అయిన ఇళ్ల రిజిస్ట్రేషన్‌ను తీర్చిన గొప్ప సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే వెలంపల్లి పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఇసరపు రాజు, ఆదినారాయణ, బాల, ప్రేమ్, చెన్నారెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవకు ప్రశంస







కలెక్టర్ ఢిల్లీరావు నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న గైనకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ వి. ఇందిరాకుమారి; గైనకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి. సబిత : డెప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ యు. శోభ



అడ్మినిస్ట్రేషన్ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ విజయలక్ష్మి



జూనియర్ అసిస్టెంట్ పీఎం కబీర్



డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వినయ్‌కుమార్



జూనియర్ అసిస్టెంట్ అరుణ్‌కుమార్



హెడ్‌నర్స్ జి. మార్తమ్మ

లబ్బీపేట(విజయవాడతూర్పు): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వాస్పత్రిలో అత్యుత్తమ సేవలు అందిస్తున్న పలువురు వైద్యులు, సిబ్బందికి కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు మంగళవారం ప్రశంసా పత్రాలు అందజేశారు. నగరంలోని తన కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రశంసా పత్రాలు అందుకున్న వారితో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, అడ్మినిస్ట్రేషన్ అధికారులు, సిబ్బంది ఉన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ డి. వెంకటేష్, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎస్ విఠల్‌రావు పాల్గొన్నారు.

వైభవంగా నగర సంకీర్తన



విజయవాడ కల్చరల్: సంగీత సన్మండలి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నిర్వహిస్తున్న సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధనా సంగీతోత్సవాలు రెండో రోజుకు చేరుకున్నాయి. త్యాగరాజస్వామి పుణ్యతిథి బహుళ పంచమి సందర్భంగా సంగీత విద్వాంసులు నగర సంకీర్తనా కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో త్యాగరాజ స్వామి, ఆంజనేయ స్వామి విగ్రహాలతో సంగీత కళాశాల నుంచి నగర సంకీర్తనా కార్యక్రమం నిర్వహించారు. సంగీత విద్వాంసులు సహితం పల్లకీ మోసి త్యాగరాజ స్వామి పట్ల ఉన్న తమ భక్తిని చాటుకున్నారు. సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్, వేమూరి విశ్వనాథ్, మల్లాది కార్తీక త్రివేణి, భమిడిపాటి శ్రీలలిత, సురేష్, రామలక్ష్మితో పాటు యువ సంగీత కళాకారులు పాల్గొన్నారు.

విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న అతిథులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు నూతన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని కృష్ణా యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పీ వీరబ్రహ్మాచారి సూచించారు. ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కళాశాల ద్వితీయ స్నాతకోత్సవం జరిగింది. కార్యక్రమంలో ఆయన కళాశాల ఉన్నత విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్‌తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరబ్రహ్మాచారి మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకొని నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని అన్నారు. కమిషనర్ డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యలో నూతన సంస్కరణలు తీసుకువస్తోందన్నారు. విద్యతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని కావున విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన ఎస్ఆర్ఆర్ కళాశాల స్నాతకోత్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉందని తెలిపారు. రీజనల్ జాయింట్ డైరెక్టర్, డాక్టర్ సీ కృష్ణ, అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ తులసి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే భాగ్యలక్ష్మి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం పీజీ, డిగ్రీ పూర్తి చేసిన 290 మంది విద్యార్థులకు పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనంతరం కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ అధ్యక్షతన కళాశాలలో గవర్నింగ్ బాడీ సమావేశం జరిగినది.గత సంవత్సర కాలంలో జరిగిన విధివిధానాలను, రాబోయే ఏడాది కాలంలో కళాశాల అభివృద్ధికి ఎటువంటి మార్పులు చేర్పులు చేయాలో సమావేశంలో చర్చించారు.

గ్రంథాలయాలు.. విజ్ఞానానికి నిలయాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సోమశేఖరరావు తదితరులు

గుణదల (విజయవాడ తూర్పు): గ్రంథాలయాల ద్వారా విద్యార్థులకు ఎంతో జ్ఞాన సంపద లభిస్తోందని ఆంధ్ర యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ కె. సోమశేఖరరావు అన్నారు. లైబ్రరీ డెవలప్‌మెంట్‌పై జాతీయ స్థాయి సదస్సు ఆంధ్రలయోల కళాశాలలో మంగళవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు జ్ఞానానికి కేంద్రాలన్నారు. విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు గ్రంథాలయాల్లో ఉండే పలు రకాల పుస్తకాలను చదవాలని కోరారు. తద్వారా సామాజిక, చారిత్రక, వైజ్ఞానిక అంశాలపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. పుస్తక పఠనం ద్వారా మస్తిష్కం పరిణతి చెందుతుందని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా యువత ఉద్యోగాలు సాధించేందుకు కావలసిన సిలబస్ గ్రంథాలయాల్లోనే లభిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు, యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అనంతరం జరిగిన లైబ్రరీల అభివృద్ధికి కొనసాగించవలసిన విషయాలను చర్చించారు. లయోల కళాశాల ప్రిన్సిపల్ ఫాదర్ కిషోర్, రెక్టర్ ఫాదర్ బాలశౌరి, కరెస్పాండెంట్ ఫాదర్ సహాయరాజ్ పాల్గొన్నారు.

నున్న నుంచి జీవీఆర్‌నగర్‌కు 33కేవీ విద్యుత్ లైన్

మధురానగర్(విజయవాడసెంట్రల్): నున్న నుంచి జీవీఆర్‌నగర్ ట్రెండ్‌సెట్ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు రూ. 1.80 లక్షలతో చేపట్టిన 33కేవీ విద్యుత్ లైన్ పనులను మంగళవారం పూర్తి చేశారు. మరింత మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకుగానూ 33కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు చేసినట్లు ఈఈ బీవీ సుధాకర్ తెలిపారు. బుధవారం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఛార్జ్ చేస్తామని అనంతరం ట్రెండ్‌సెట్ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి శ్రీనగర్‌కాలనీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ లైన్ నిర్మాణం వల్ల వేసవిలో నిరంతరంగా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసే అవకాశం లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈ బసవరాజు, ఏఈ శివారెడ్డి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



పారిశుద్ధ్య నిర్వహణ పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. స్థానిక 28వ డివిజన్ శ్రీనగర్‌కాలనీలో మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డివిజన్‌లో శానిటేషన్, మురుగు కాలువలో మురుగు పారుదలను స్వయంగా పరిశీలించారు. రోడ్డు మీద ఉన్న మ్యాన్ హోల్ రోడ్డుతో సమానంగా లేకపోవడం గమనించి మ్యాన్ హోల్స్ ఎత్తును పెంచి రోడ్డుకు సమానంగా కట్టవలసిందిగా అధికారులను ఆదేశించారు. రోడ్డు మీద భవన నిర్మాణ వ్యర్థాలను వదలివేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే భవన నిర్మాణ వ్యర్థాలు తొలగించి శుభ్రం చేయాలని సూచించారు. అలాగే రోడ్డు మార్జిన్స్‌లో ఉన్న పేవర్ బ్లాక్ సమాంతరంగా లేకపోవడంతో పాదచారులు ఇబ్బందులు పడే అవకాశం ఉన్న దృష్ట్యా సరిచేయాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్, వార్డు శానిటరీ సెక్రటరీ సస్పెండ్

పారిశుద్ధ్యం సక్రమంగా లేకపోవడంతోపాటు మురుగుకాలువలు పారకపోవడంతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి, వార్డు శానిటరీ సెక్రటరీ వీరాస్వామిని సస్పెండ్ చేశారు. కార్యక్రమంలో నగర పాలకసంస్థ అధికారులు పాల్గొన్నారు.

గాంధీజీ ఆశయ సాధనకు సీఎం జగన్ కృషి

మధురానగర్(విజయవాడసెంట్రల్): మహాత్మా గాంధీ ఆశయ సాధనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. 30వ డివిజన్ రామకృష్ణాపురంలో మంగళవారం స్థానిక కార్పొరేటర్ బీ జానారెడ్డి, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యాన గాంధీజీ వర్ధంతి కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో వెలంపల్లి ముఖ్య అతిథిగా పాల్గొని గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేశారని పేర్కొన్నారు. నేటి యువత గాంధీజీ చూపిన మార్గంలో పయనించాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ గాంధీజీ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, డివిజన్ ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌టీఎస్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

గాంధీజీ వర్ధంతి పురస్కరించుకుని బీఆర్‌టీఎస్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు, డెప్యూటీ గవర్నర్ డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు నేటి యువత గాంధీ అడుగుజాడల్లో నడవాలని కోరారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కే రాము, కోశాధికారి జీ ఏడుకొండలు, సభ్యుడు పీ రమేష్ పాల్గొన్నారు. స్థానిక 31వ డివిజన్ ముత్యాలంపాడులో స్థానిక కార్పొరేటర్ పెనుమత్స శిరీష గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె గాంధీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పెనుమత్స సత్యం, అంగిరేకుల విజయ్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వాసవీక్లబ్ భవన్‌లో..

పాయకాపురం(విజయవాడరూరల్): రాజీవ్‌నగర్‌లోని వాసవీక్లబ్ భవన్‌లో మంగళవారం గాంధీజీ వర్ధంతి కార్యక్రమం జరిగింది. వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు, ప్రముఖ సంఘ సేవకుడు వేముల హజరత్తయ్య గుప్తా పాల్గొని గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అహింసాయుత సమాజ ఆవిష్కరణకు కృషి చేయడమే ఆయనకు నిజమైన నివాళి అని గుప్తా తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గవర్నర్ కొత్త గణేష్‌బాబు, క్యాబినెట్ సెక్రటరీ సురేష్, లక్ష్మీనారాయణ, రీజియన్ ఛైర్మన్ ప్రభాకర్‌రావు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వాంబేకాలనీలో..

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వాంబేకాలనీలో గాంధీ వర్ధంతి కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. దీనిలో పాల్గొన్న జనంలోమనం స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు పొదిగింటి నాగరాజు గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 10 మంది పేద కుటుంబాలకు 26 కేజీల బియ్యం బస్తాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గాంధీజీ చేసిన పోరాటాలు ఎంతో అమూల్యమైనవని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు బెవర నారాయణ తదితరులు పాల్గొన్నారు. యునైటెడ్ ఎన్జీఓ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారి ఆధ్వర్యంలో సింగ్‌నగర్ పైపులు రోడ్ జంక్షన్ వద్ద గాంధీ వర్ధంతి కార్యక్రమం జరిగింది. అసోసియేషన్ సభ్యులు గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యునైటెడ్ ఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు అలంపూరు విజయ్, పింగళి వెంకయ్య చారిటబుల్ ట్రస్ట్ సెక్రటరీ గాయిత్రమ్మ, యునైటెడ్ హ్యూమన్ రైట్స్ ఆఫ్ ఏపీ అధ్యక్షుడు ఆసిఫ్, ఎన్జీఓ సభ్యులు పాల్గొన్నారు.



గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



చిత్తరంజన్ గ్రంథాలయంలో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సంపత్‌కుమార్

చిత్తరంజన్ గ్రంథాలయంలో ..

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయంలో జాతిపిత గాంధీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న గ్రంథాలయ అధికారి పి.సంపత్‌కుమార్ విద్యార్థులు, పాఠకులతో కలసి మహాత్ముని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రంథాలయ సిబ్బంది పాఠకులు పాల్గొన్నారు.